# కానిస్టేబుల్ కనకయ్య

నైట్ డ్యూటీ చేసి పీక్కు పోయిన ముఖంతో ఇల్లు చేరుకున్నాడు కానిస్టేబుల్ కనకయ్య.

ఇంట్లో అడుగు పెట్టాడో లేదో. "మా నాన్నగారు వచ్చారండి" అన్నది భార్య కాంతమ్మ అత్యంత ఆనందోత్సాహంతో.

ఆ వార్తకు కనకయ్య గుండెల్లో గునపం దిగినట్లైంది. కొన్ని క్షణాలు అతడి నోటి నుండి మాటలులేవు. పోలీసు డిపార్టుమెంటులో వుద్యోగ మవడంవల్ల పుచ్చుకోవడమే గాని ఎన్నడూ ఇవ్వడం ఎరుగడు. అతిథులు వచ్చినా, అప్పులు వచ్చినా కబుర్లతో ముంచెత్తి మంచి నీళ్లతోనే సరిపెట్టడం అతనికి పరిపాటి. కాంతమ్మ మనస్తత్వం అందుకు పూర్తిగా భిన్నం. అతిథుల్ని ఆదరించి సత్కరించాలన్నది ఆమె అభిమతం. ఈ విషయంలో ఆ భార్యా భర్తల మధ్య ఎప్పుడూ గొడవే.

అతడి పరిస్థితి చూసి "అదేమిటండీ అలా అయిపోయారు?" అంది కాంతమ్మ.

ఆ మాటలకు తేరుకుని. "అబ్బే ఏంలేదు" అంటూ పెదిమలు విరిచాడు.

రాత్రి డ్యూటీగదా అల్లుడుగారు అలసి పోయినట్లున్నారు. తొందరగా కాఫీ పట్టుకురామ్మా మంచం వాల్చారు మామగారు.

మంచంమీద చతికిల పడ్డాడే గాని ముళ్లమీద కూర్చునట్లుంది కనకయ్యకి.

"అదేనోయ్ తాలూకా ఆఫీసు పనిమీద వారం రోజులు ఇక్కడుండవలసి వచ్చింది. ఊళ్లో అమ్మాయి, అల్లుడూ వుండగా మరో చోట వుండడం బావుండదని..."

మామగారి మాటలకు కనకయ్య గుండెల మీద పిడుగు పడ్డట్టయింది. ఒక రోజు కాదు. రెండ్రోజులు కాదు... వారం... అంటే ఏడురోజులు వీడబ్బగారిల్లు అనుకున్నాడో ఏమిటో. అతగాడి కూతుర్ని చేసుకున్నందుకు తనకది శిక్షలా వుంది తనకు పండక్కి కొత్త సైకిలు కొంటానని చెప్పి ఐదేళ్లయింది. ఇంతవరకూ అంచుల్లేవు. పైగా... ఇలా ఆలోచిస్తూ వుండి పోయిన భర్తకు కాఫీ అందించింది కాంతమ్మ.

వేడివేడి కాఫీ గొంతుక దిగేసరికి కాస్త కోలుకుని సభ్యత కోసం లేని చిరునవ్వును బలవంతంగా తెచ్చుకుంటూ పలకరించాడు.

ఈమాట ఆమాట అయ్యేక భార్య ప్రక్కకు పిలిచి, "రాక రాక ఇన్నాళ్లకు నాన్నగారు మనింటికొచ్చారు. పచ్చడి మెతుకులతో సరిపెడితే బావుండదు. బజారుకెళ్లి కూరలు పట్టుకురండి" సంచీ చేతికిచ్చింది.

కూరల ధరలు ఆకాశాన్ని అంటుతున్న ఈ రోజుల్లో రోజూ కూరలంటే తన పని ఖాళీయే. మామగార్ని తిరిగి పంపే మార్గం కనుచూపు మేరలో కానరాక పోవడంతో అయిష్టంగానే సంచీ పుచ్చుకుని సైకిలు బయటకు తీసాడు కనకయ్య.

"నాకుమాత్రం ఇక్కడ ఒక్కడికి ఏం తోచి చస్తుంది.... పద.. నేనూ వస్తాను." అంటూ అతడిని అనుసరించారు మామగారు.

ఇద్దరూ నడుచుకుంటూ కొంతదూరం వెళ్లారు. ట్రాఫిక్ పోలీసు గురునాధం కనిపించడంతో మామగార్ని అక్కడో క్షణం వుండమని చెప్పి అతడితో తన బాధ విన్నవించుకున్నాడు. అంతే గురునాధం కనకయ్య చెవిలో ఏదో చెప్పాడు.

అతని సలహాకి కనకయ్య మొహం పద్మంలా విప్పారింది.

"స్టేషనులో నాకు కొంచెం పనుంది. అది చూసుకుని కూరలు కొనుక్కొని వస్తాను. మీరు ఇంటికి వెళ్లి పొండి ఎండలో ఎక్కువసేపు తిరగలేరు". అంటూ సైకిలు మామగారికిచ్చాడు. కనకయ్య మరి కొంత దూరం వెళ్లాకా.

అల్లుడి సలహా ప్రకారం వెళ్లి పోయారు మామగారు.

భోజనాల దగ్గర కనకయ్య మామగారి నుద్దేశించి "వంటలెలా వున్నాయి?" అడిగాడు.

"బ్రహ్మండంగా ఉన్నాయి. కాని నేను ఇప్పుడే మావూరు వెళ్లి పోదామను కుంటున్నాను." అంటూ కంచంలో చేతులు కడుక్కున్నారు.

'మీదే ఆలశ్యం' అనాలనుకున్నాడు కనకయ్య అయితే ఆ మాటలు నోట్లోనే

వుండిపోయాయి.

తండ్రి ఆకస్మిక ప్రయాణానికి ఆశ్చర్య పోయింది కాంతమ్మ.

తండ్రి వెళ్లి పోగానే "మీరేమైనా అతనిని అన్నారా!" భర్తను నిలదీసింది కాంతమ్మ.

తనకేమీ తెలీదన్నట్లు ముఖం పెట్టాడు కనకయ్య.

"మరి హఠాత్తుగా వెళ్లి పోవడానికి కారణం?"

"ఏమో నాకేం తెలుసు." అని అక్కడ నుండి చల్లగా జారుకున్నాడు కనకయ్య.

మామగారు సైకిలు మీద ఇంటికొస్తున్నప్పుడు రాంగ్ సైడ్‌లో వెళుతున్నందుకు కేసు పెడతానని బెదిరించాడు ట్రాఫిక్ పోలీసు. దాంతో అతను భయపడి పోయి పదిహేను రూపాయలు లంచమిచ్చి ఆ ముప్పు నుండి బయట పడ్డాడు. ఇదంతా గురునాధం కనకయ్య పధకం ప్రకారం జరిగింది. గురునాధం ఐదు రూపాయలుంచుకుని కనకయ్యకు పది రూపాయలిచ్చాడు. ఆ డబ్బుతో కూరలు కొనుక్కొచ్చాడు కనకయ్య.

పోలీసు వాడింట్లో వుంటే లాభం గూబల్లోకి వస్తుందని గ్రహించిన మామగారు ఉన్న పళంగా వుడాయించారు.

అసలు విషయం తెలియక వెర్రిమొహం పెట్టింది కాంతమ్మ.

● *ఆంధ్రసచిత్ర వారపత్రిక 8.3.85* ●